సాక్షి
నిర్మల్
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



క్వారీలో జంగల్ సఫారీ

మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ జంగల్ సఫారీకి వేదిక కానుంది. ఇన్నాళ్లు ఎంసీసీ క్వారీ అంటే దుర్గాదేవి జాతర గుర్తుకు వచ్చేది. ఇక జంగల్ సఫారీకి ఆహ్వానించనుంది. 8లో▸

గంగా హారతికి ఆహ్వానం

బాసర: కార్తిక పౌర్ణమి సందర్భంగా బాసరలో శుక్రవారం నిర్వహించే గోదావరి ప్రత్యేక హార తి కార్యక్రమానికి రావాలని బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయ ఈవో విజయరామారావు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను ఆహ్వానించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఈవోకు సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /17.1

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం చాలా వరకు ఎండగా ఉంటుంది. ఇక రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భావవ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలి

• గిరిజన సంక్షేమశాఖ డీడీ చందన



మాట్లాడుతున్న చందన

నిర్మల్‌ఖిల్లా: అభ్యసన ప్రక్రియ ద్వారా విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలని రాష్ట్రగిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (విద్యావిభాగం) చందన సూచించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. ప్రతీ పాఠశాలలో 'యంగ్ ఒరేటర్ క్లబ్' ఏర్పాటు చేసుకుని విద్యార్థుల్లో ఆంగ్లభాష వ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకోగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. జిల్లా గిరిజనశాఖ అధికారి అంబాజీ, హెచ్‌ఎం ఆర్.తుకారం, విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



కరణ్



నిర్గున్

లక్ష్మణచాంద: బేస్‌బాల్ అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. నిర్మల్‌లో గురువారం జరిగిన జోనల్‌స్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న కరణ్, నిర్గున్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ఎంపియ్యారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు



పరిశీలిస్తున్న విజయ రామారావు

భైంసాటౌన్: ఆలయ భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ నిజామాబాద్ సహాయ కమిషనర్ విజయరామారావు హెచ్చరించారు. పట్టణంలోని భైంసా–బాసర మార్గంలోని 435, 468 సర్వే నంబర్లలోని దేవాదాయ శాఖ భూముల్లో కబ్జాలను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వే నంబర్ 435లో శ్రీ వేంకటేశ్వర ఆలయానికి చెందిన 4.14 ఎకరాలు, అలాగే సర్వేనంబర్ 468లో నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని శ్రీవేంకటేశ్వర ఆలయానికి చెందిన 5.19 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు పరిశీలించి ఆక్రమణలను గుర్తించామన్నారు. కబ్జాలు తొలగించాలని నోటీసులు జారీ చేస్తామని, ఎలాంటి క్రయవిక్రయాలు జరుపవద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఈవో వేణు, ఇన్‌స్పెక్టర్ కమల ఉన్నారు.

నాట్యంలో కొరిటికల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న జోగన్‌పల్లి సాయిసహస్ర, పాకల ప్రణతి, లాస్య, హర్షిణి, పూదరి రితిక రాష్ట్రస్థాయి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సంగీత, నాటక అకాడమీ, తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కొరిటికల్ పాఠశాల విద్యార్థులకు ప్రముఖ కవి, గీత రచయిత అందెశ్రీ బహుమతులు అందించారు. ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిచారు.

భూమాత కోసం నిరీక్షణ!

ఈ ఫొటోలోని



రైతుపేరు కట్ట భూమారెడ్డి. కుంటాల మండలం విట్టపూర్ గ్రామానికి చెందిన ఈయనకు సర్వే నంబర్ 282లో 4.13 ఎకరాలకు సంబంధించిన పాత పాసు పుస్తకం ఉంది. అప్పట్లో పహణీ, వన్‌బీ మండల కార్యాలయం ద్వారా పొందాడు. ధరణి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక వీరికి కొత్త పాస్‌బుక్ అందలేదు. దీంతో ప్రభుత్వం ద్వారా అందజేసే రైతుబీమా, రైతుబంధు పథకాలకు అర్హత కోల్పోయాడు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విన్నవించినా ధరణి పోర్టల్‌లో ఆప్షన్ లేని కారణంగా ఏమీ చేయలేమని అధికారులు చెప్పారు. 2022, మేలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో 11 నూతన ఆప్షన్లు అందుబాటులోకి తేవడంతో ఇతని సమస్య తీరుతుంది అనుకున్నాడు. కానీ నేటికీ అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చే భూమాత పోర్టల్‌తో తన సమస్య పరిష్కారం అవుతుందని ఎదురు చూస్తున్నాడు.



ఈనెల 13 నాటికి జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు

మొత్తం పెండింగ్ దరఖాస్తులు	తహసీల్దార్ లాగిన్‌లో	ఆర్డీవో లాగిన్‌లో	అదనపు కలెక్టర్ లాగిన్‌లో	కలెక్టర్ లాగిన్‌లో
1,652	331	238	366	717

• జిల్లాలో 1652 భూ సమస్యలు పెండింగ్
• ధరణి పోర్టల్‌లో దొరకని పరిష్కారం
• తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
• కాంగ్రెస్ సర్కార్ తెచ్చే కొత్త పోర్టల్‌పై ఆశలు

నిర్మల్‌చైన్‌గేట్: భూమాత ఎప్పుడొస్తావమ్మా.. అంటూ జిల్లాలోని ధరణి బాధిత రైతులు ఎదురుచూస్తున్నారు. ధరణి పోర్టల్‌తో భూసమస్యలు పరిష్కారం కాక రైతులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ భూములకు భలే డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యలు కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మీ సేవల్లో వేల రూపాయలు ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా లాగిన్లలో రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివి రిజెక్ట్ చేస్తున్నారు. ఈ విషయమై ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించగా అధికారుల నుంచి సరైన సమాధానమే ఉండడం లేదని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో భూ సమస్యలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

కలెక్టర్ లాగిన్‌లో 717 దరఖాస్తులు..

ధరణి పోర్టల్‌ను గత ప్రభుత్వం 2020, అక్టోబర్ 2న అమల్లోకి వచ్చింది. భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కరించేందుకు జీఎల్‌ఎం పేరిట వెసులుబాటు కల్పించింది. రైతులు మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా తహసీల్దార్లకు కలెక్టర్ చేరవేస్తారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన నాలుగు రోజుల్లోనే పరిష్కరించాలి. అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఏ దశలో ఉందనే విషయాన్ని సంబంధిత దరఖాస్తుదారుడికి తెలుపాలి. కానీ ఈనెల 13వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 1,652 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో తహసీల్దార్ లాగిన్‌లో 331, ఆర్డీవో లాగిన్‌లో 238, అదనపు కలెక్టర్ లాగిన్‌లో 366, కలెక్టర్ లాగిన్‌లో 717 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

అధికారుల నిర్లక్ష్యమే..

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా భూముల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ఉపయోగించిన ఎల్‌ఆర్ యూపీ వెబ్‌సైట్‌ను రద్దు చేసి ధరణి వెబ్‌సైట్‌ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్ పుణ్యమా అని భూ వివరాలు సరిదిద్దే అవకాశం తహసీల్దార్ల చేతుల నుంచి కలెక్టర్ల చేతుల్లోకి వెళ్లింది. రైతులు తమ భూ సమస్యలను ధరణి వెబ్‌సైట్ ద్వారా కలెక్టర్లకు విన్నవించేందుకు వెబ్‌సైట్ జీఎల్‌ఎం, టీం–33 మాడ్యుల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆప్షన్ల ద్వారా వేల మంది రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తున్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి సర్వే నంబర్‌పై మోఖా పంచనామా నిర్వహించి తుది నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడకు చేరిన నివేదికలను వేగంగా పరిశీలించి డిజిటల్ సంతకాలు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతుల దరఖాస్తులు నెలల తరబడి కలెక్టర్ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి.

మాడ్యూల్స్ లేని సమస్యలెన్నో..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మాత్రమే స్పెషల్ డ్రైవ్‌లో అవకాశం కల్పించారు. మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ నమోదు కావడానికి అవకాశం లేని ధరణి సమస్యలు కూడా ఎన్నో ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి డమ్మీ ఖాతాలు.. రికార్డుల ప్రక్షాళన సమయంలో గ్రామానికో డమ్మీ ఖాతాను సృష్టించారు. సర్వే నంబర్ వారీగా స్పష్టత లేని భూములు అంటూ మిగిలిన మొత్తం విస్తీర్ణాన్ని ఆ ఖాతాలలో వేసేశారు. ఇప్పటి వరకు డమ్మీ ఖాతాలు తెరుచుకోలేదు. ఇలాంటి మరెన్నో రకాల సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ధరణి వెబ్‌సైట్‌లో 75 రకాల సమస్యలను నిపుణుల కమిటీ గతంలో గుర్తించింది. మరో 40 నుంచి 50 రకాల సమస్యలు తాజాగా ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలిసింది.

కొత్త పోర్టల్‌పై ఆశలు..

ధరణి పోర్టల్‌లోని నిబంధనలతో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్ ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తేవాలని చూస్తోంది. దీనికి సంబంధించిన నిబంధనలు ఇంకా ఖరారు కానప్పటికీ ఆయా మండలాల్లోని తహసీల్దార్లు మాత్రం త్వరలో భూమాత వస్తుంది, మీ సమస్యలు త్వరగా పరిష్కరమయ్యే అవకాశం ఉందని చెబుతూ కార్యాలయాలకు వచ్చే రైతులను తిరిగి పంపిస్తున్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక.. పట్టాదారు, పాసుపుస్తకాలు రాక రైతులు బ్యాంకు రుణాలు, రైతుబంధు, ఇతర ప్రయోజనాలు పొందక తీవ్రంగా నష్టపోయారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ తీసుకువచ్చే భూమాత కోసం నిరీక్షిస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

• జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి రాధిక

సోన్: సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక సూచించారు. సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం అమ్మాయిలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీల విజేతలు సాయికృష్ణ, వివేక్, రాహుల్‌కు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆరాధన, ఉపాధ్యాయులు సుజాత, లింగాగౌడ్, సిరాజ్ హైదర్, ముత్తన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠకులకు సౌకర్యాలు కల్పిస్తాం

• జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ



మాట్లాడుతున్న అర్జుమంద్ అలీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయంలో గురువారం ప్రారంభించారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా గ్రంథాలయం అగ్రభాగంలో ఉండాలన్నారు. ఇక్కడ చదివే పాఠకులు ఉన్నత స్థానానికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పర్యవేక్షణ.. మరింత పక్కాగా



ప్రభుత్వ పాఠశాలలో బోధనతీరును పరిశీలిస్తున్న ఎంఈవో(ఫైల్)

• అన్ని మండలాలకు విద్యాధికారుల నియామకం
• సర్కారు బడుల బలోపేతం దిశగా అడుగులు
• నాణ్యమైన ప్రభుత్వ విద్యకు దోహదం...

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టిసారించింది. విద్యాశాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తుండడంతో విద్యావ్యవస్థ బలోపేతంపై అధికారులు సైతం ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలకు సీనియర్ పీజీ హెచ్‌ఎంలను విద్యాశాఖ అధికారులుగా నియమించింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవోలందరికీ అక్టోబర్ 29న విద్యాక మిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డితోపాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. దీనితోపాటు రానున్న రోజుల్లో పాఠశాల విద్యాశాఖను మరింత పరిపుష్టం చేసేందుకు ప్రణాళికలను రూపొందించడంలో భాగంగా సలహాలు, సూచనలు కోరారు. సర్కారు బడుల ప్రతిష్టను మరింత పెంచేలా మండల విద్యాశాఖ అధికారులు పని చేయాలని సూచించారు. జిల్లా నుంచి 19 మంది రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణలో పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం విద్యార్థుల ప్రగతి కోసం ఎంఈవో సమష్టి కార్యాచరణతో ముందుకెళ్లాలని నిర్ణయించారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మొత్తం 19 మండలాలు ఉండగా గతంలో నాలుగైదు మండలాలకు ఒకరు ఇన్‌చార్జి మండల విద్యాధికారులుగా వ్యవహరించేవారు. మండలాల పరిధి ఎక్కువగా ఉండడంతో వారికి పర్యవేక్షణ చేయడంలో ఇబ్బందులు తలెత్తేవి. సారంగాపూర్ మండలానికి చెందిన ఎంఈవో.. పెంబి, దస్తురాబాద్ వంటి సుదూర మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో విధుల నుంచి తమను తప్పించాలని విజ్ఞప్తులు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మండలానికి ఒక ఎంఈవోను నియమించడంతో అధికారులతోపాటు ఉపాధ్యాయులు సైతం సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీనియర్ పీజీ హెచ్‌ఎంగా ఉన్న ఆయా మండలాల పరిధిలోని వారిని ఎంఈవోలుగా నియమించడంతో పర్యవేక్షణ చేసేందుకు సరళతరం అవుతుందని భావిస్తున్నారు.

బడుల బలోపేతానికి దోహదం...



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గత నెలలో మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు చేపట్టాం. గతంలో ఒక్కో ఎంఈవోకు నాలుగైదు మండలాలకు పైగా ఇన్‌చార్జి బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ భారం అయ్యేది. ప్రస్తుతం మండలానికో ఎంఈవోను కేటాయించడం శుభ పరిణామం. పర్యవేక్షణ బాధ్యతలను పకడ్బందీగా చేపడుతున్నాం. విద్యావ్యవస్థ మరింత పటిష్టం చేయడానికి మా వంతు ప్రయత్నం చేస్తాం.

– తొడిశెట్టి పరమేశ్వర్, ఎంఈవో, సోన్ మండలం

ఎంఈవోల విధులు ఇలా...

• మండల విద్యాధికారులు ప్రతీరోజు కనీసం రెండు పాఠశాలలను సందర్శించి తనిఖీ చేయాలి. పాఠశాలలో సమకూరిన వసతులపై ఆరా తీసి అవసరమైన వాటిని ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు చేపట్టాలి.
• మండల స్థాయిలో సర్వీస్ బుక్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశ పాఠశాల కమిటీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాలు విద్యాప్రమాణాలు పెంచే చర్యలకు మార్గనిర్దేశం చేయాలి.
• మధ్యాహ్న భోజనం రుచి, శుచితో విద్యార్థులకు అందించేలా పర్యవేక్షణ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కుల పంపిణీ అమలుతీరును పర్యవేక్షించాలి.
• విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించే చర్యలను చేపట్టేందుకు మార్గనిర్దేశం చేయాలి. డ్రాపౌట్స్ కూడా తగ్గించేందుకు ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలి.
• మండల పరిధిలోని పాఠశాలల స్థితిగతులపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయాలి. ఉపాధ్యాయుల హాజరు, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేలా పర్యవేక్షించాలి.
• ప్రతీ సంవత్సరం అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులకు, సీఆర్పీలకు తర్ఫీదు ఇవ్వాలి.

అధైర్య పడొద్దు..



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



ముఖాముఖికి హాజరైన పీయూసీ2 విద్యార్థులు

• పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి
• ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర: విద్యార్థినులు అధైర్య పడొద్దని, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు సూచించారు. పీయూసీ2 విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌తో కలిసి 17 కమిటీల విద్యార్థులతో వర్సిటీలో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. గతంలో ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అనంతరం స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లోని ఆడిటోరియంలో పీయూసీ2 విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయని, ధైర్యంగా అధిగమించాలని సూచించారు. నూతన ఆవిష్కరణలకు అంకురార్పణ చేసేలా ఆలోచనా విధానం ఉండాలని పేర్కొన్నారు. వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు ప్రొఫైల్ యాప్ రూపొందించాలని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సూచించారు. ప్రతిభతో రాణించేందుకు తగిన ప్రణాళికలు రచించుకోవాలన్నారు. మన ఆలోచనా విధానమే మనకు మార్పుకు నాంది పలుకుతుందని తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ నెల రోజులుగా వర్సిటీలో తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ రాజేశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, వివిధ విభాగాల అధికారులు, క్యాంపస్ చీఫ్ సెక్రెటరీ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనాలని ఆందోళన



రైతులకు నచ్చజెబుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

కుంటాల: ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయడాన్ని నిరసిస్తూ లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామ రైతులు గురువారం రోడ్డెక్కారు. కుంటాల మండలం 61వ జాతీయ రహదారిపై అర్లి(కె) క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం నిర్వాహకులు ఆరు లారీల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ గోదాంకు తరలించారు. తరుగును రైతులే భరించాలని గోదాం నిర్వాహకులు చెప్పడంతో ఐకేపీ నిర్వాకులు ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. రెండు రోజుల క్రితం కొనుగోళ్లు ప్రారంభించి భైంసా మండలం వానల్‌పాడ్ రైస్‌మిల్‌కు తరలించారు. మిల్ యజమాని బస్తాకు 43 కిలోల చొప్పున తూకం వేసి తీసుకుంటానని చెప్పారు. దీంతో రైతులు బస్తాకు 42 కిలోలు మాత్రమే ఇస్తామని తెలుపడంతో బుధవారం మళ్లీ కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతులు న్యాయం చేయాలని కోరుతూ అర్లి(కె) క్రాస్ రోడ్డు వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న లోకేశ్వరం తహసీల్దార్ అర్క తుకారాం అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ఘటన స్థలికి చేరుకుని రైతులు చెప్పిన విధంగానే బస్తాకు 42 కిలోలు తూకం వేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున రైతులకు న్యాయం చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు. మూడు గంటల పాటు ఆందోళన చేయడంతో రోడ్డు కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. భైంసా, నిర్మల్ రూరల్ సీఐలు నైలు నాయక్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సైలు భాస్కరాచారి, హన్మాండ్లు, అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆహారం వేటలోనే పులి

ఖానాపూర్: జిల్లాలో పెద్దపులి వేట కొనసాగిస్తోంది. మామడ అటవీ రేంజ్ పరిధిలోని పెంబి మండలం బుర్కలేగి గ్రామంలో సోమవారం ఎద్దును చంపిన పులి బుధవారం సాయంత్రం వరకు అదే కళేబరం తింటూ గడిపింది. గురువారం వేకువజామున 3 గంటల వరకు ఎద్దు కళేబరం తిటూ ఆకలి తీర్చుకుంది. అది అయిపోవడంతో తిరిగి వేటకు బయల్దేరింది. గురువారం మధ్యాహ్నం మామడ మండలం దిమ్మదుర్తి అటవీ రేంజ్ పరిధిలోని ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్) తండా శివారు అటవీ ప్రాంతంలో పశువుల మందపై పంజా విసిరింది. ఈ విషయం మండల ప్రజలకు తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. పులి సంరక్షణ చర్యలు చేపడుతున్న అటవీశాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పశువుల కాపరులు, రైతులు అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లొద్దని దిమ్మదుర్తి, ఖానాపూర్, మామడ ఎఫ్‌ఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, కిరణ్, అవినాస్ సూచించారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్ఎం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు తమ సమస్యలు, సలహాలు, సూచనలు చేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు కొనసాగే ఈ కార్యక్రమానికి 9959226000 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు డయల్ యువర్ మంచిర్యాల డీఎం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎ జనార్దన్ తెలిపారు. ప్రయాణికుల సమస్యలతోపాటు సందేహాలు నివృత్తి చేసుకోవడం.. సలహాలు ఇచ్చేందుకు 9959226004 ఫోన్ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి దుర్మరణం

- నలుగురికి స్వల్పగాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ శివారు ప్రాంతాంలో గల డంపింగ్ యార్డు సమీపంలోని మొరం క్వారీలో అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ మహిళా కూలీ దుర్మరణం చెందింది. స్థానికులు, ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. బంగారుగూడకు చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు రోజు మాదిరిగానే గురువారం వ్యవసాయ కూలీ పనులకు ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యలో డంపింగ్‌యార్డు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మొరం తవ్విన క్వారీలో వర్షపు నీరు నిల్వ ఉంది. ఆటో అదుపుతప్పి అందులో పడిపోవడంతో ఊపిరాడక కవిత మోరె (34) అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురిని అటువైపు నుంచి వెళ్తున్న కచికంటి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దోతి అందించి ప్రాణాలు కాపాడాడు. డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యవసాయ కూలీలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మృతురాలి భర్త దీపక్ మోరె ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ సయ్యద్ నజీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



దగ్ధమైన దుకాణం

ఇంద్రవెల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని దుకాణం దగ్ధమైంది. స్థానికులు, దుకాణం నిర్వాహకుడు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌కు చెందిన మోతివార్ శాంభ వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే చాయ్, చెప్పులు, కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి దుకాణం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై దుబ్బాక సునీల్‌తో పాటు రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఎన్ఎస్ఐసీ హైదరాబాద్ ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమి ఆధ్వర్యంలో గ్యాస్ చార్జింగ్, ఎయిర్ కండీషనర్ ఇన్స్టాలేషన్, వాటర్ ప్యూరిఫైయర్ నిర్వహణ, మరమ్మతులు, తదితర విభాగాల్లో ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం రూ.15 వేల నుండి 20 వేల వేతనంతో కూడిన ఉపాధి కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 16 నుంచి 25 వరకు ఉట్నూర్ ఐటీడీఏలోని గిరిజన శిక్షణ ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 62816 67501 నంబరులో సంప్రదించాలన్నారు.

క్వారీలో జంగల్ సఫారీ

- వన్యప్రాణుల సందర్శనకు 'గాంధారీ ఖిల్లా సఫారీ'
- కనువిందు చేయనున్న ప్రకృతి, అడవి అందాలు
- పర్యాటకంగా అభివృద్ధికి అటవీ శాఖ కసరత్తు
- మరో వారంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



జంతువుల తాగునీటికి ఏర్పాటు చేసిన నీటికుంట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎత్తయిన కొండలు.. దట్టమైన అటవీ ప్రాంతం.. పచ్చని అడవి.. పక్షుల కిలకిల రావాలు.. అందమైన నీటి కొలనులు.. వెరసి మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ జంగల్ సఫారీకి వేదిక కానుంది. ఇన్నాళ్లు ఎంసీసీ క్వారీ అంటే హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి దుర్గాదేవి జాతర గుర్తుకు వచ్చేది. ఇక జంగల్ సఫారీకి ఆహ్వానించనుంది. మరో వారం రోజుల్లో గాంధారి ఖిల్లా సఫారీ ప్రారంభానికి అటవీశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలోని పాత మంచిర్యాల అటవీ బీట్ పరిధి హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ శివారులో ఎంసీసీ క్వారీలోని అటవీ ప్రాంతంలో సఫారీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాతమంచిర్యాల, తిమ్మాపూర్, బొక్కలగుట్ట అటవీ బీట్ అడవుల పరిధిలో సఫారీ పర్యటన సాగనుంది. లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాశ్ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్‌ఓ అతావుల్లా, ఎఫ్‌బీఓ రాజేందర్, సంతోష్ గురువారం సఫారీకి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. సఫారీ రూట్ మ్యాప్‌తోపాటు అడవిలో ఉన్న మంచెలు, నీటికుంటలు, వ్యూ పాయింట్లపై మరోసారి సమీక్షించి వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ పత్యక్ష పర్యవేక్షణలో మరో వారం రోజుల్లో సఫారీని ప్రారంభించనున్నట్లు తెలిపారు.



పర్యాటకులు సేదదీరేలా ఏర్పాటు చేసిన మంచె



ఎంసీసీ క్వారీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అటవీ రేంజ్ అధికారి సుభాష్

మంచెల ఏర్పాటు

జంగల్ సఫారీలో భాగంగా పర్యాటకులు అడవి అందాలు, వన్యప్రాణులను వీక్షించేందుకు ఆరు మంచెలు ఏర్పాటు చేశారు. వణ్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఐదు నీటికుంటలు ఏర్పాటు చేసి వాటిలో నీరు నింపేందుకు సోలార్ సబ్ మెర్సిబుల్ పంప్ సెట్‌తో బోర్ వేయించారు. 20 కిలోమీటర్ల మేర సఫారీ ట్రాక్, ట్రాక్ మధ్యలో 24 మీటర్ల వెడల్పుతో పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు. పనుల కోసం రూ.25 లక్షలు ఖర్చు చేస్తున్నారు. క్వారీ నుంచి గాంధారీ ఖిల్లా, నీటికుంటలు, అటవీ జంతువులు, అటవీ అందాలను వీక్షించవచ్చు. జంగల్ సఫారీకి ఒక్కో టిప్పుకు రూ.2 వేల వరకు రుసుం ఉండనున్నట్లు సమాచారం.

వన్యప్రాణులు..

అటవీ ప్రాంతంలో శాఖాహార, మాంసాహార జంతువులు, వివిధ రకాల వణ్యప్రాణులు ఉన్నాయి. పెద్దపులి, చిరుత పులులు, ఎలుగుబంట్లు, అడవి బర్రెలు, దుప్పులు, మెఖములు, చుక్కల దుప్పులు, అడవి కుక్కలు, నక్కలు, సాంబర్‌లు, అడవి పందులు, నెమళ్లు ఉన్నాయని అటవీ అధికారులు తెలిపారు. క్వారీకి వెళ్లే మార్గంలో ఎత్తయిన గుట్టల నుంచి తీసిన రహదారి, మూలమలుపులు, పచ్చని చెట్లు అలరిస్తాయి. ఎంసీసీ పరిశ్రమ గుట్టలపై ఉన్న చెట్లలో పార్కుల నిర్మాణం చేపట్టి పిక్నిక్ స్పాట్‌గా మార్చింది. ఆదివారం వచ్చిందంటే చాలు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి సేద తీరుతారు. ఇప్పటికే జిల్లాలోని జన్నారం కవ్వాల్ అభయారణ్యంలో జంగల్ సఫారీకి పర్యాటకులు వస్తుంటారు.

కెమెరాకు చిక్కిన పులి..

ఇటీవల సఫారీ ఏర్పాట్లలో భాగంగా రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన కెమెరాకు అడవిలోకి వెళ్తున్న పులి చిక్కింది. హాజీపూర్ మండల పరిధిలోని అటవీ శివారుల ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. కెమెరాకు చిక్కిన పులి చిత్రాలను అటవీ అధికారులు గురువారం విడుదల చేశారు.

వారంలో ప్రారంభం



అడవి అందాలు, వణ్యప్రాణులతోపాటు చారిత్రాత్మక ప్రాంతమైన గాంధారీ ఖిల్లాను వీక్షించేందుకు క్వారీలోని అడవుల్లో 20 కిలోమీటర్ల మేర జంగల్ సఫారీ ఏర్పాటు చేస్తున్నాం. వారం రోజుల్లో ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నాం. నిత్యం 50 మంది కూలీలు, యంత్రాల సహాయంతో సఫారీ ట్రాక్ పూర్తి చేయించగా అటవీలో ఎలాంటి చెత్త లేకుండా పనులు పూర్తి చేయిస్తున్నాం.

– అత్తె సుభాష్, అటవీ రేంజ్ అధికారి

పెన్‌గంగ తీరంలో భక్తుల సందడి



ఉత్సవ మూర్తులకు చక్రస్నానం

తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని వడూర్ శివారులో ఉన్న పెన్‌గంగ నదీ తీరం వద్ద గురువారం భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాస పూజల్లో భాగంగా భక్తులు గంగానదిలో చక్రస్నానాలు ఆచరించారు. ఉదయం హోమంతో పాటు పెన్‌గంగలో శ్రీసీతారామచంద్రుల ఉత్సవ మూర్తులకు భక్తజనుల మధ్య వైభవంగా చక్రస్నానం చేయించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో నదీతీరం భక్తజనంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ప్రోగ్రాం నిర్వాహకుడు చిల్కూరి సంజీవ్ రెడ్డి, గ్రామపెద్దలు నితిన్, ఉల్లాస్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.



చక్రస్నానానికి ఉత్సవమూర్తులు

బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు

దండేపల్లి: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్–14 బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. పోటీలను పాఠశాల హెచ్ఎం రాజు ప్రారంభించారు. నాలుగు జిల్లాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు ప్రథమ, ఆదిలాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో వెలనూర్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి, నాయకులు మురళీకృష్ణ, అశోక్, శేఖర్, ప్రసాద్, ఎస్‌జీఎఫ్ మంచిర్యాల జిల్లా సెక్రెటరీ ఫణిరాజా పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

భైంసాటౌన్: కుభీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించేందుకు యత్నించడంతోపాటు, మరొకరి సెల్ ఫోన్ చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వివరాలు వెల్లడించారు. చొండికి చెందిన బి.శ్రీరంగ్ కుభీర్‌లోని కల్లు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈనెల 12న ఇంటికి వెళ్లేందుకు బస్సుకోసం వేచి ఉన్నాడు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని ఇస్లాంపూర్‌కు చెందిన తాడుల్కర్ లమన్, ఇంగోలే ఆకాశ్, పవార్ ఓం బైక్‌పై వచ్చి అతడిని బెదిరించి ఫోన్ లాక్కుని పారిపోయారు. అదేరోజు బస్సు కోసం వేచి ఉన్న భైంసాకు చెందిన రాథోడ్ లలిత మెడలోని చైన్ దొంగిలించేందుకు ప్రయత్నించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కుభీర్ మండలం సవదాస్‌నగర్‌లో లమన్, ఆకాశ్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు ఓం పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు గోపీనాథ్, నైలు, కుభీర్ ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి రవాణా
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వేణుచందర్

జైపూర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి అక్రమంగా జిల్లాకు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నలుగురి వ్యక్తులను అరెస్టు చేసి 1.380 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్‌లో ఏసీపీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారిపై నర్వగ్రామ శివారులో పోలీసులు తనిఖీ చేపట్టారు. పోతారాజుల ఆకాశ, దూట రాజ్‌కుమార్, షేక్ అఫ్రీది, తోట ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా సీలేరు గ్రామం నుంచి గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి తెచ్చి జైపూర్ మండల చుట్టుపక్కల గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. వచ్చిన డబ్బుతో మద్యం తాగి జల్సాలు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు



హుండీని పరిశీలిస్తున్న లోకేశ్వరం ఎస్సై అశోక్

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామంలోని ఊరు చిరవలో ఉన్న లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో చోరీకి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు న మోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆలయంలో బుధవారం రాత్రి గర్భగుడి తాళం, జ గదాంబ ఆలయం హుండీ తాళం గుర్తుతెలి యని వ్యక్తులు పగలగొట్టారని పూజారి రామానుజంస్వామి గ్రామస్తులకు, లోకేశ్వరం పోలీ సులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ గురువారం ఉదయం ఆలయానికి వచ్చి సీపీ ఫుటేజీలు పరిశీలించాడు. ఇందులో అదే గ్రా మానికి చెందిన మీసాల ఎల్లగౌడ్ ఆయలం తా ళం, హుండీ తాళం పగలగొట్టిన దృశ్యాలు రికా ర్డు అయ్యాయి. వీటి ఆధారంగా ఎల్లగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన షేక్‌గౌస్, షేక్ షబీర్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పున్నంచంద్ తెలిపారు. ఈ నెల 13న దేవాపూర్ పాత అంగడి బజార్‌లో ఉన్న యువతికి వరుసకు మామ అ యిన షేక్‌గౌస్ ఫోన్ చేసి ఆమె అన్న, మేనమామకు జరిగిన గొడవ విష యం మాట్లాడాలని, పీరీల బంగ్లా వద్దకు రావాలని చెప్పాడని తెలిపారు. యువతి రాగానే గౌస్ అతడికి వరుసకు తమ్ముడు అయ్యే షబీర్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, బాధితురాలు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద కుటుంబీకులు, గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం రాత్రి ఇల్లు దగ్ధమైంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొడిపెల్లి పోశెట్టి కుమారుడు అఖిలాస్, కోడలు శ్రీజ దంపతులు నివాసం ఉండే ఇంట్లో రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రెండు రోజుల క్రితం అఖిలాస్ ఊరికి వెళ్లడంతో కోడలు శ్రీజ పిల్లలతో కలిసి తల్లి గారింటికి వెళ్లింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఇంట్లో నిల్వ ఉన్న 25 క్వింటాళ్ల పత్తి, తులానికి పైగా ఉన్న బంగారు నగలు, రూ.40 వేల నగదుతోపాటు ఇంటి సామగ్రి పూర్తిగా దగ్ధమైందని కుటుంబీకులు తెలిపారు. కౌలురైతు అయిన పోశెట్టి అప్పులు చేసి సాగు చేసిన పంటను ఇంట్లో నిల్వ ఉంచగా పూర్తిగా కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని మాజీ సర్పంచ్ చిన్నం లావణ్యరవి, మాజీ ఎంపీపీ గడ్డం లావణ్యరవీందర్, గ్రామస్తులు తెలిపారు.



శివాజీ చౌక్‌లో చంకన చంటిపాపను ఎత్తుకొని యాచిస్తున్న చిన్నారి



సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న వాహనదారులను యాచిస్తున్న బాలిక



జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తాలో పాత సామాన్ల విక్రయానికి వచ్చిన బాలిక

ఈ 'బాలల'కు ఏదీ సంబురం?

భారత తొలి ప్రధాని పండిత్ జవహార్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నవంబర్ 14న ఏటా బాలల దినోత్సవం నిర్వహిస్తారు. పాఠశాలల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులు సంబురాలు చేసుకుంటుంటే.. వీధి బాలలు మాత్రం వేడుకలకు దూరంగా ఉన్నారు. కొందరు నిర్మల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇలా భిక్షాటన చేస్తూ, మరికొందరు బాల కార్మికులుగా, ఇంకొందరు చెత్త ఏరుతూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడలు

- బహుమతులు ప్రదానం చేసిన కలెక్టర్



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్

ముధోల్: ముధోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల మైదానంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు. ముందుగా విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ దశలో విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ప్రతిభ చూపాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయని తెలిపారు. పోటీ తత్వం పెరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల యాజమాన్యం కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, బాసర జోన్ అధికారి పీఆర్ ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చల్ల నరసింహారెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్, పీఈటీలు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా ఆస్పత్రిలో షార్ట్‌సర్క్యూట్



కాలిపోయిన స్పెషల్ వార్డు గది పైకప్పు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగింది. ఆకస్మికంగా చోటు చేసుకున్న ఈ ఘటనతో సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం స్పెషల్ వార్డు ఏర్పాటు చేశారు. ఈ వార్డు నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుకర్ సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పి వేశారు. గది పైకప్పు, ఏసీ మిషన్ కాలిపోయాయి. సింగరేణి అధికారులు ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన వైర్లు కావడంతో ప్రమాదం జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ కరెంట్ వైరింగ్ సరిగా లేక గోడలపై నీళ్లు రావడంతో కరెంట్ షాక్ వచ్చిన సంగతి తెలిసిందే. సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎదులాపురం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు వన్‌టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన సామ అమరేందర్‌రెడ్డి ఈనెల 13న ఇంటికి తిరిగివస్తుండగా విద్యార్థి కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. అతనికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం ఉదయం క్షతగాత్రుని భార్య రాధిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అశిష్ యాక్సిడెంట్ చేసినట్లుగా గుర్తించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.